BHARATH SAMACHAR DIGITAL

12, మే 2026, మంగళవారం భారత్ సమాచార్

కొనుగోళ్లు వేగవంతం చేయకుంటే ఆందోళన తప్పదు



భారత్ సమాచార్.నెట్, మెదక్ జిల్లా: వెల్దుర్తి మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింలు శేఖర్ గౌడ్ ఆరోపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు గుట్టలుగా పేరుకుపోయాయని, హమాలీలు, లారీల కొరత కారణంగా సేకరణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి వెంటనే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శేఖర్ గౌడ్ హెచ్చరించారు.

© 2026 Bharath Samachar